

# మధ్యతరగతి మందహాసం

## పన్యాల రంగనాధరావు

రాత్రి వొంటిగంటప్పుడు గోపాలం మంచం మీద మేకల్లే లేచి కూర్చున్నాడు.

"మధ్య తరగతి మనస్తత్వానికి మాయని గాయంలా ఉన్నాను..."

గోపాలం మెదడులో కవిత్వం మెదలుతున్నది. ఆ మధ్య ఎవరిచేతిలోనో కనిపించిన ఒకపత్రికలో ప్రసిద్ధ గేయం వొకటి గోపాలాన్ని అమితంగా ఆకర్షించింది!

కాని, మధ్యతరగతి దరిద్రంలో ఉన్న తనకు, కవిత్వం రాసేకన్నా, ఇంకొకరిది, తనకు బాగా నచ్చినది చదవటమే హాయిగా ఉంటున్నది!

ఈ గేయరచయిత, తనను ఎక్కడో ఎప్పుడో చూసి ఉండాలి. నిస్సందేహంగా, ఈ గేయం, తనను లేదా, తనకు ప్రతిబింబంగా ఉన్న మరొకర్ని చూసి రాసిందే!

రాత్రి వొంటిగంటప్పుడు మంచం మీద మేకల్లే లేచికూర్చున్న గోపాలం, తనదిండు కింద ఉన్న పుస్తకం మధ్యలో కాగితం తీసి, మడతవిప్పి, ఆ గుడ్డివెలుగులోనే, మరొకసారి చదువుకున్నాడు.

"ప్లాస్టిక్ నవ్వుల్లో దాగిన ... సృష్టి రహస్యాలు పరికిస్తున్నాను"

గోపాలానికి ఈ చరణం చిన్న నవ్వు తెప్పించింది. గోపాలానికి నిద్రపట్టలేదు.

మూడురోజులైై తనకు దూరమైన నిద్ర కోసం, ఇంత ప్రయత్నం ఎన్నడూ చేయలేదు! నిద్ర దానంత టది ముంచుకురావాలి గాని, దానికోసం ఇంతప్రయత్నం ఏమిటనుకున్నాడు గోపాలం.

ఈమధ్య దుకాణాలలో నిద్రమాత్రలు చాలా విరివిగా అమ్ముడు పోతున్నాయిట! అయితే, అవి కొనటానికేనా నాలుగు డబ్బులుండాలి కద! బహుశా డబ్బుండేవారికి నిద్రపట్టకపోతేనే అవి పని చేస్తాయి కాబోలు. తనవంటివాడు ఒక వేళ ఒకటో అరో మాత్రకొన్నా, డబ్బుపెట్టి కొన్నానే అనే ఆలోచనతో అసలు నిద్ర పట్టదు!

రాత్రి వొంటిగం టప్పుడు, మేకల్లే లేచిన గోపాలం, ఒకసారి పక్కమీదకు చూశాడు.

తనతోపాటు రెండురాత్రులు ఎందుకో అర్థం కాకుండానే మేలుకొన్నది శాంత! ఇప్పుడు గాఢనిద్రపోతున్నది. ఆ నిద్రలో అమాయకత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది!

అంత ప్రశాంతమైన నిద్ర, చీకూచింతా లేని నిద్ర, తనకు ఒక్కగంటపాటు పట్టినా చాల్ను.

పాపం! శాంత!

తన్ను పెళ్ళిచేసుకున్న రెండోరోజునే తన దరిద్రాన్ని పంచుకోవటం ప్రారంభించింది. ఆ దరిద్రాన్నే అనుభవించటం అలవాటు చేసుకున్నది.

అయితే ఈ దరిద్రంలో, దాదాపు ఏణ్ణర్థం కిందట తను ఎందుకు పెళ్ళి చేసుకున్నదీ తనకే అర్థం కాలేదు! పెళ్ళి కక్కుర్తి కాకుంటే మరేమిటి?

ఈ దరిద్రానికి చాలనట్టుగా ఇంకో నెల రోజులలోనే తన అంచనా సరిగా ఉంటే - శాంత కనబోతున్నది!

గోపాలానికి నవ్వొచ్చింది.

రాత్రి వొంటిగంటప్పుడు, మేకల్లే లేచి కూర్చున్న గోపాలానికి, తన్ను పట్టి పీడిస్తున్నది దరిద్రమే అనే నమ్మకం గట్టిగా కలిగింది.

తాను పుట్టిపెరిగిన తన వూరు-ఏ వూరైతే నేం అది తన స్వస్థలం కాకపోయినా - అసలు తనకు స్వస్థలమంటూ లేకపోయినా, కనీసం తన తెలుగుదేశం - తనూ తన శాంతా బతకటానికి ఇంత ఆధారం చూపెట్టలేకపోయింది. ఇవ్వతలచుకుంటే ఆ మాత్రం ఆధారం ఇచ్చి ఉండేదని నప్పు పట్టగలిగిన గోపాలానికి, ఈ దరిద్రం

తనకే కాదనీ, తనకు మల్లేనే, కొన్ని లక్షల మందికికూడా తనదేశం ఇదే దరిద్రాన్ని ప్రసాదించిందనీ, చప్పున తట్టలేదు. కేవలం తను వొక్కడే ఇంత అన్యాయానికి పాల్పడ్డట్టు గోపాలం అనుకోవడంతో పొరపాటే పడి ఉండొచ్చు. అయితే, తన వంటి ప్రతీ దరిద్రుడూ ఇదే పొరపాటు పడుతున్నాడనికూడా గోపాలానికి తట్టలేదు.

తనకన్నా దరిద్రులు లేరనా?

ఉన్నారు! సోమయాజుల్ని చూడరాదూ? వాడు తనతోకలిసి రెండోఫారం దాకా చదివాడు. వాడికి పైగా, నా అన్నవా రెవరూలేరు! అంతటితో చదువు సాగక, తను చూస్తూ ఉండగానే, కాఫీ క్లబ్బులో సర్వరుగా చేరిపోయినాడు!

కనీసం, తిండికి కరువులేని ఉద్యోగం!

ఆ పని తను చేయగలడా? ఈ తేడా ఎక్కడుందీ?

గోపాలం తండ్రి విషయం కూడా అంతంత మాత్రంగానే ఉండేది. గోపాలం ఎప్పుడైతే అది గ్రహించాడో, ఆ నాడే, తన తండ్రిమీద రెండు జీవితాల భారమైనా తగ్గించాలని పొట్టచేత్తో పట్టుకొని, వెయ్యిమైళ్ళ దూరం ప్రయాణం చేశాడు అప్పు పెట్టి!

అప్పిచ్చువాడు వైద్యుడు! అప్పులిచ్చేవాళ్ళు ఇంకా దొరుకుతున్నారు! అదెంతకాదు!

తనవంటివాళ్ళు, తండ్రిమీద ఇంకా ఆరుగురు ఆధారపడి ఉన్నారు. ముగ్గురు చెల్లెళ్ళలోనూ పెద్దదానికీ, తనకూ, పెళ్ళిళ్ళు చేసేసరికే ఉన్న కొంపకాస్తా తిలోదకాలయిపోయి, మూడు చెరువుల నీళ్లు తాగవలసొచ్చింది తన తండ్రి! ఇంకా, పెళ్ళికి సిద్ధంగా ఇద్దరున్నారు. ముగ్గురు తమ్ముళ్లూ పూర్తిగా పసికందులు. వీళ్ళు పెద్దయి పెరిగేదెప్పుడు? ఎవరిదారి వారు చూసుకునేదెప్పుడు? తల్లికూడా అంతంతలోనే ఉంది. ఆవిడకు ఏదన్నా కాస్త చప్పుడు వింటే చాల్ను – గుండెదడ వచ్చేస్తుంది. ఏడుగురు సంతానాన్ని కన్నదానికి గుండెదడరాక ఏం చేస్తుంది?

తన కీ గొడవలన్నీ పట్టినట్టు తన తండ్రికేమీ పట్టలేదు. దరిద్రాన్ని తానుగుర్తించినంతగా తన తండ్రి గుర్తించినట్టే కనపడలేదు. దరిద్రం తాండవిస్తున్నదన్న విషయం తాను గుర్తించకపోవడం మాటటుంచి, శ్లేష్మంలోపడ్డ ఈగలాగా, దరిద్రంలో కొట్టుకుంటున్న సత్యాన్ని ఎవరూ గమనించకుండా చేశాడు తండ్రి! పోతే, తనంతట తానే ఈ యదార్థం గుర్తించటంవల్ల తనకు వొరిగిన దేమిటి? ఏం లేదు! అందుకే గోపాలం, తన తండ్రి పద్ధతే బాగున్నదనుకున్నాడు.

నందో రాజా భవిష్యతి!

మూడు రోజులై, దరిద్రమంటే ఏమిటి అని తనలోతను చేసుకుంటున్న తర్జన భర్జనలతో గోపాలానికి బొత్తిగా నిద్రపట్టలేదు. రెండు పూటలూ, నిశ్చింతగా కడుపునిండా తినటానికి తన ఆదాయం అనుమతించటం లేదు. రాత్రులుతినే తిండి తనకు వొంటపట్టడం లేదని, శాంతతో అబద్ధమాడాడు!

శాంతకు – అన్నట్టు ఇటువంటి సమయంలో కాసిని పళ్ళన్నా తెచ్చిపెట్టకుంటే ఎట్లా?

ఇందుతో కాస్త అప్పుకూడా పెరిగింది. అప్పంటూ పుట్టింది.

ఆ మాత్రం పరపతి ఈ దరిద్రంలో పుట్టించుకోవడం కూడా ఒక ఘనతే మరి!

అమాంబాపతులన్నీ కలిసొచ్చే తన ఆదాయం నెలసరి రెండొందల రూపాయలలోనూ, మూడోవంతుదాకా తాను కాపరముంటున్న గదికి ఇవ్వాలి. ఆ మాత్రం దొరికింది! అదెంతకాదు! పోతే మిగిలినదానితో రెండు ప్రాణాలు లాక్కురావడం, ఈ రోజుల్లో మాటలు కాదు. రేషన్లు తెచ్చుకోవాలి. ఉప్పూ, పప్పూ చూడాలి. చాకలాడు! శాంతకు పళ్ళు కావాలి. పాపం శాంత కావాలనటం లేదు! ఇంకా తన బస్సు ఖర్చు!

అయితే, తనకన్న తక్కువ జీతగాళ్లు, ఈ దరిద్రాన్ని ఎట్లా ఎదుర్కొంటున్నారో, గోపాలానికి అర్థంకాలేదు. చూస్తూ చూస్తూ వాళ్ళు బతుకుతున్న పద్ధతిలో తను బతకలేడు!

మొన్ననే ఒక బంట్రోతు 'మీ పాతషర్టు ఒకటి ఉంటే నాకు పడేయండి,"అన్నాడు.

"నువు రోలువీ – నేను మద్దెలను! నువు నాతో మొరపెడతావు?" అన్నాడు తను! తను, ఇంకొకర్ని, తనకన్న మరో పదిరాళ్ళు ఎక్కువ తెచ్చుకునేవాణ్ణి అట్లా యాచించగలడా? ...

మధ్యతరగతి దరిద్రం చేస్తున్న మంద హాసంకాక మ రేమిటి?

శాంత కదిలింది. "మీరు నిద్రపోవటం లేదూ?" అన్నది శాంత.

"నాకు నిద్ర రావటంలేదు!" అన్నాడు తను.

"పడుకోండి, అదే పడుతుంది. మీ కెప్పుడూ ఒకటే ఆలోచన?'' అన్నది శాంత.

నిజం! తన కెప్పుడూ ఒకటే ఆలోచన! ఆ విషయం శాంత గ్రహించేసింది. దరిద్రం గురించి వచ్చిన ఈ దరిద్ర పాలోచన దరిద్రం తీరిపోతేగాని పోదేమో!

"నాకు కొంచెం తోడొస్తారా?" అన్నది శాంత లేచి.

"పద!" అన్నాడు గోపాలం.

శాంత బయటకు వెళ్ళి తిరిగివచ్చి మళ్ళీ పడుకున్నది.

"నాకు ఏదో మాదిరిగా ఉన్నదండీ!" అన్నది శాంత కొద్దిగా ఆయాసంతో.

"ఎట్లా ఉంది?" అన్నాడు గోపాలం.

శాంత సమాధాన మివ్వకుండా అటువైపు వొత్తిగిలి పడుకున్నది.

"నొప్పిగా ఉంటున్నదా?" అన్నాడు గోపాలం అనుమానం వేసి.

"ఏమో!... తెలీదు!..."అన్నది శాంత.

శాంతకు నొప్పులు ప్రారంభం కాదు కదా!

శాంతకు పుట్టిల్లంటూ లేకపోవటం కూడా తన దరిద్రంలో ఒక భాగమే! ఉంటే, ఈ బెడద కొంత తీరేదికద!

తన బావ! చీకూ చింతా లేకుండా ఇల్లరికం వెలిగిస్తున్నాడు!

తనదగ్గర ఒక అయిదు రూపాయల కాగితం తప్ప చిల్లిగవ్వకూడా లేనిస్థితి. ఇదేనా, తెల్లవారితే రేపనుకి సరిపెట్టటాని కంటూ భద్రపరచిన బాపతు.

ఇప్పుడు శాంతకు, నిజంగానే నొప్పు లారంభమైతే, ఎవర్ని ముట్టెత్తాలి? ఈ గదిలో ఎట్లా కంటుంది?

ఇప్పు డేం చేయాలి?

తినటానికి తిండీ, జీవితంలో కావలసిన కనీసపు అవసరాలూ లేకపోవడంకన్నా దరిద్రం ఇంకేముంటుంది మరి? దరిద్రం అనేకరూపాలలో ప్రత్యక్షమవుతూ ఉంటుం దనుకున్నాడు గోపాలం.

ఎంతవారి కంత దరిద్రం! చేసు కున్నమ్మకు చేసుకున్నంత అన్నట్టు!

ఈ సామెత జ్ఞాపకమొచ్చి గోపాలం అంత దరిద్రపాలోచనలోనూ నవ్వుకు న్నాడు. దరిద్రం - తను అనుకుంటున్న దరిద్రం - తనకన్న హీనమైనస్థితిలో ఉండే వారికి స్వర్గంలాగా తోచవచ్చునేమో!

త ననుకోవటంలో, తనకన్న మరో వందరూపాయలు ఎక్కువ తెచ్చుకుంటున్న వారు ఎంత అదృష్టవంతులో అని!

అన్ని తరగతులవారికీ, దరిద్ర మంటే ఒకే అర్థం తోచినప్పటికీ, ఒక్కొక్కరికి ఒక్కో-రూపంలో అది ప్రత్యక్ష్యం కావటం లోనే ఉంది, అనుకున్నాడు గోపాలం.

మధ్యతరగకి చెందిన తను అనుభవించే ఈ దరిద్రం పెద్దదరిద్రం కాకపోవచ్చు.

దరిద్రాన్ని దరిద్రంగా గుర్తించుకో వటంలోనూ, అది తీర్చుకోవాలంటే తన కెదురైన అవకాశాలు వినియో గించుకునే శక్తిలేకపోవటంలోనూ ఉంది చిక్కు. ఈ చిక్కు తీర్చుకోవాలంటే, తన కెదురైన సాంఘిక పరిస్థితులు తన కేమాత్రమూ సహాయం చేయకపోగా, తన్ను మరింత దరిద్రుణ్ణి చేశాయి.

"డబ్బు తేలేనట్టి నరులకు కీర్తి సంపద లబ్బవోయ్..." అన్నముక్క జ్ఞాపక మొచ్చింది గోపాలానికి.

తనకు కీర్తీవొద్దు, సంపదావొద్దు - అంత కన్న ముందు, తనవంటి వారి దరిద్రానికి ఒక పరిష్కారం అంటూ కనిపిస్తే చాల్ను.

తను వేసుకున్న లెక్క ప్రకారం కాకుండా, పదిహేనురోజులు ముందుగానే గోపాలానికి, దరిద్రం ఒకకొత్తరూపంలో సాక్షాత్కరించింది.

ఈసారి సుపుత్రుడి రూపంలో!

అప్పులో అప్పు!

శాంతను ఆస్పత్రిలో చేర్పించటమే మంచి దయింది!

అయితే గోపాలానికి ఇది దరిద్రం తాలూకు ప్రత్యక్షావతరంగా కనబడలేదు. తను ఒక తండ్రి అయినాడన్నపితృభావం ఇందులో ఇమిడి ఉన్న దరిద్రభావాన్ని అణచివేసింది - తాత్కాలికంగా!

ఆ రోజున గోపాలం అనుభవించినంత ఆనందం అదివరకెన్నడూ అనుభవించలేదు.

శాంతకు సుఖమైన ప్రసవంకూడాను! ఇదొక గుడ్డిలోమెల్ల!

ఆ ఆనందంలోనే మూడో నాడు, ఒక కార్డుకొని, గోపాలం, తల్లిపేర ఉత్తరం రాశాడు.

"...మొన్న పదిహేనో తారీఖు తెల్ల వారుఝామున అంటే అయిదూ పది నిమి షాలకు, ఇక్కడి ఆస్పత్రిలో నీకు మను మడు కలిగాడు...తల్లీ పిల్లవాడూ క్షేమం. ఈ శుభవార్త అందరిచెవినీ వేయవలెను."

ఇది పోస్టు చేసిన సాయంకాలమే, తాను తాత్కాలికంగా మరిచిపోయిన దరిద్రం రెట్టింపుతో, మరో రూపంలో ప్రత్యక్షమయింది గోపాలానికి. ఈ దరి ద్రం, తండ్రిరాసిన ఉత్తరంలో కనిపిం చింది.

"...ఇవాళటికి, పదిహేను రోజులై మీ అమ్మ జబ్బుతో తీసుకుంటున్నది. గుండె దడతోపాటు, ఇప్పుడు కడుపులో "కేన్సర్"అని అనుమానిస్తున్నారు. ఆప రేషను అవసరమంటున్నారు. నువు పెద్ద వాడివి. ఒకసారి వచ్చి, మీ అమ్మనుచూసి వెళ్ళగలవా?..."

ఒకొక్కప్పుడు, దరిద్రానికి హఠా త్తుగా ప్రత్యక్షమయ్యే శక్తికూడా ఉం టుందని గోపాలం ఊహించలేకపోయి నాడు. తను ఉన్నస్థితిలో తక్షణం ఎట్లా ప్రయాణం చేయాలో తెలీలేదు. అవసర మైనప్పుడు తల్లిని ఒకసారి చూసుకోడా నికి అవకాశం లేకపోవటం అన్నింటికన్న మించిన దరిద్రం!

"...నాన్నగారికి - శాంతకు పురు డొచ్చిందని, నిన్ననే అమ్మపేర కార్డు రాశాను. ఈ పరిస్థితిలో దాన్ని వొదిలి ఎట్లా రాగలనో, అర్థం కాకుండా ఉంది. అమ్మకు ఎట్లా ఉన్నదీ, వెంటనేరాయండి."

తాను రాలేనన్న విషయం స్పష్టంగా రాయటానికి ఇంతకన్నా చాతకాక, ఒక ఉత్తరం రాసి, ఒక్కడే తన గది చేరు కున్నాడు గోపాలం. తనకు అప్రయత్నంగా దుఃఖం ముంచుకొచ్చింది. దిండులోముఖం పెట్టి, గోపాలం వెక్కి-వెక్కి ఏడవ సాగాడు.

ఆ దుఃఖంలోనే చప్పున శాంతా, చంటి వాడూ జ్ఞాపకం వొచ్చారు.

గోపాలం వెంటనే లేచి, ఆస్పత్రి చేరు కునేసరికి, అప్పటికే వేళమించిపోయి గేట్లు మూసేశారు.

ఈసారి గోపాలానికి దుఃఖం రాలేదు. ఎదురుగా దరిద్రదేవత నాట్యం చేస్తున్నట్టు మాత్రం కనిపించింది.

"...విల్లులావంగిన వెన్నుపూసతోనే విజయదశమి జరుపుకుంటున్నాను ..."

మధ్యతరగతి మరొకసారి చేసిన దరిద్ర హాసం గోపాలం కళ్ళకు కట్టింది.